సాక్షి
బాపట్ల
గురువారం, 21, నవంబర్, 2024



గ్యాస్ ఆటోలో మంటలు

తాడేపల్లి రూరల్: చెన్నై – కోల్‌కత్తా జాతీయ రహదారిలో కొలనుకొండ వద్ద బుధవారం వెళ్తున్న ఖాళీ గ్యాస్ సిలిండర్ల లోడు ఆటో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టులో 43.25 టీఎంసీల నిల్వ ఉంది. ఎగువ నుంచి నీటి ప్రవాహం రాకపోవడంతో, దిగువకు నిలుపుదల చేశారు.

నరేంద్రస్వామికి ప్రత్యేక అభిషేకాలు



భట్టిప్రోలు : మండలంలోని పెదపులివర్రులో గల బాలాత్రిపురసుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో బుధవారం ప్రాతః కాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

మహిళా వ్యాపారి ఆత్మహత్యాయత్నం

బల్లికురవ: బాకీదారులు ఇంటిపై దాడి చేయడంతో మనస్తాపం చెంది ఓ మహిళా వ్యాపారి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం బాపట్ల జిల్లా బల్లికురవ మండలం కొప్పరపాడు గ్రామంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. గ్రామానికి చెందిన అచ్చి రాధ.. భర్త అంకమ్మరావు, సిమెంట్, ఇనుము హార్డ్‌వేర్ వ్యాపారం చేసేవాడు. కాగా మూడు సంవత్సరాల కిందట కరోనా వ్యాధితో అంకమ్మరావు చనిపోయాడు. అప్పట్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాధ సర్పంచ్‌గా పనిచేసి ఓటమి పాలైంది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు ఆమె భర్త తమ వద్ద అప్పులు తీసుకున్నాడని గ్రామానికి చెందిన కొందరు ప్రాంసరీ నోట్లు తెచ్చి చూపించారు. అయితే బాకీలు ఉన్నట్లు భర్త తనకు ఎప్పుడూ చెప్పలేదని, తాను ఇచ్చే పరిస్థితిలో లేనని రాధ చెప్పింది. దీంతో బాకీదారులంతా కోర్టుకు ఎక్కారు. పైగా ఈ ఏడాది అక్టోబర్ 19న, నవంబరు 19న బాకీదారులు కలిసి సొమ్ము చెల్లించాలంటూ దుకాణం వద్ద గొడవలకు దిగారు. ఈ క్రమంలో తనపై, తల్లిపై దాడి చేయడంతో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరిందని రాధ కుమార్తె వెంకట పద్మావతి తెలిపింది. కుటుంబ సభ్యులు ప్రథమ చికిత్స నిమిత్తం తొలుత అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడ నుంచి ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు.

పట్టాలిచ్చారు.. ఖాళీ చేయాలంటున్నారు!



బల్లికురవ: గిరిజనులకు గతంలో ప్రభుత్వం నివేశన స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేయగా అక్కడే జీవనాన్ని వెళ్లదీస్తున్నారు. కానీ అకస్మాత్తుగా ఇళ్లు చేయాలని కోర్టు నోటీసులు ఇవ్వడంతో వారంతా బుధవారం ఆందోళనకు దిగారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల బాధ్యులు తంగిరాల వెంకటేశ్వర్లు, పావులూరి రమణయ్య బుధవారం లబ్ధిదారులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామానికి చెందిన 35 మంది గిరిపుత్రులకు సర్వే నంబర్ 36, 37లో మూడున్నర దశాబ్దాల క్రితం ప్రభుత్వం నివేశన స్థలం పట్టాలిచ్చింది. ఇళ్లు నిర్మించుకుని సిపాయి కాలనీగా నామకరణ చేసుకున్నారు. కుల వృత్తులు, కూలీనాలీ పనులతో జీవనాన్ని వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో 2014 అద్దంకికి చెందిన సత్య నరేంద్ర కుమార్ ఈ 10 ఎకరాల భూమి కొనుగోలు చేసినట్లు చూపి.. ఖాళీ చేయాలంటూ హుకుం జారీ చేశాడు. కాగా 2017లో నరేంద్రకుమార్ కోర్టులో కేసు వేయడంతో ఇటీవల గిరిజనులకు నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇళ్లు నిర్మించుకుని జీవిస్తుంటే ఎలా ఖాళీ చేస్తారని నేతలు ప్రశ్నించారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి జైలు

చినగంజాం: బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో ఓ వ్యక్తికి 20 ఏళ్లు కఠిన కారాగార శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధిస్తూ ఒంగోలు పోక్సో కోర్టు న్యాయమూర్తి రాజా వెంకటాద్రి తీర్పు చెప్పారు. ఎస్ఐ శీలం రమేష్ అందించిన వివరాలు ప్రకారం.. బాపట్ల జిల్లా చినగంజాం మండలం సంతరావూరు గ్రామంలోని మాదిగ పల్లెలో రెండో తరగతి చదువుతున్న ఆరేళ్ల బాలిక 2018 మార్చి 20న మధ్యాహ్నం 2 గంటలు సమయంలో పాఠశాల వద్ద ఆడుకుంటోంది. అదే గ్రామానికి చెందిన 57 ఏళ్ల వయస్సున్న దుడ్డు చిన్నబ్బాయి కన్నేశాడు. బాలికకు మాయమాటలు చెప్పి స్కూల్ వెనుక ఉన్న తుమ్మచెట్లలో తీసుకొని వెళ్లి లైంగిక దాడి చేస్తుండగా అదే పాఠశాలలో చదువుకుంటున్న బాలుడు చూసి కేకలు వేశాడు. దీంతో నిందితుడు బాలికను వదలి పరారయ్యాడు. ఆమె ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు విషయం చెప్పగా, తల్లి చినగంజాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి చినగంజాం ఎస్ఐ ఏ. వెంకటేశ్వర్లు కేసు నమోదు చేయగా , ఒంగోలు పోక్సో కోర్టులో విచారణకు వచ్చింది. బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ పర్యవేక్షణలో ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, చినగంజాం ఎస్ఐ శీలం రమేష్, కోర్టు కానిస్టేబుల్ జి. నాగేశ్వరరావు సాక్షులు సరైన పద్ధతిలో సాక్ష్యం చెప్పే విధంగా కోర్టుకు హాజరు పరిచారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్లు కోర్టులో వాదించి నిందితుడిపై మోపిన నేరాన్ని నిరూపణ చేయగలిగారు. దీంతో ఒంగోలు ఏడీజే (ఎఫ్ఏసీ) ప్రత్యేక కోర్టు, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాజా వెంకటాద్రి బుధవారం నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధించారు. బాధితురాలికి ప్రభుత్వ నుంచి రూ. 7 లక్షలు నష్టపరిహారం ప్రకటించారు.

ఆశలన్నీ కడలిపాలు

నేడు అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం

వేట నిషేధ కాలం ముగిసి ఐదు నెలలు పూర్తయినా టీడీపీ, కూటమి ప్రభుత్వానికి గంగపుత్రుల ఆవేదన మచ్చుకైనా పట్టడం లేదు. సూపర్ సిక్స్‌లో ఒక్కో పథకం కనుమరుగైన విధంగా భరోసా సాయం పథకం కూడా కూటమి ప్రభుత్వం కప్పెట్టేసింది. ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో మత్స్యకారులకు వేట నిషేధం ఉంటుంది. ఈ సమయంలో వారి కుటుంబాలను ఆదుకునేందుకు వీలుగా ప్రభుత్వం కొంత సాయాన్ని భృతిగా అందజేస్తుంది. కానీ ఈ ఏడాది మాత్రం పథకంపై నీలినీడలు కమ్ముకోవడంతో మత్స్యకారుల జీవితాల్లో చీకట్లు అలముకున్నాయి. బతుకు దుర్భరంగా మారింది.



- ఎన్నికలకు ముందే అలవికాని హామీలు గుప్పించిన చంద్రబాబు, కూటమి నేతలు
- అధికారం చేపట్టాక వాటి ఊసే లేదు
- వేట నిషేధం పూర్తయ్యి ఐదు నెలలు దాటినా దక్కని మత్స్యకార భరోసా సాయం
- ఐదేళ్లు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న వైఎస్. జగన్ సర్కార్

చీరాల టౌన్: 'గంగ పుత్రులంటే నాకు విపరీతమైన ఇష్టం.. ప్రాణాలకు తెగించి వేట సాగిస్తారు.. మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే వేట నిషేధ సాయం ఏడాదికి ఒక్కొక్కరికీ రూ.20వేలు ఇస్తా.. డీజిల్ సబ్సిడీ పెంచుతా. పక్కా ఇళ్లు కట్టిస్తా' అని చీరాల్లో ఎన్నికలకు ముందు జరిగిన సభలో చంద్రబాబు ఇచ్చిన వాగ్దానం. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా నేటికీ వేట నిషేధ సాయం ఇవ్వకుండా మత్స్యకారులకు మొండి చెయ్యి చూపారు. రీ సర్వేల పేరుతో కాలయాపన చేస్తూనే ఉన్నారు. 2024 జూన్‌లో ఇవ్వాల్సిన నిషేధ సాయం నేటికీ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని చీరాల, పర్చూరు, బాపట్ల, రేపల్లె, అద్దంకి, వేమూరు నియోజకవర్గాల్లో 53,000 మంది మత్స్యకారులు కాగా ఇందులో సముద్రంలో వేటకు వెళ్లే వారు 16500 మంది ఉన్నారు. అధికారులు ఇప్పటివరకు సర్వేచేసిన సమాచారం మేరకు భరోసాకు ఈ ఏడాది 12,350 మంది లబ్ధిదారులు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో కేవలం 10.500 మందిని అర్హులుగా నిర్ధారించారు. వీరికి రూ. 20 వేల చొప్పున రూ. 25 కోట్లను చెల్లించాల్సి ఉంటుంది. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వేట నిషేధ సమయంలో ఐదేళ్ల క్రమం తప్పకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఏడాదికి రూ. 10 వేలు చొప్పున చెల్లిస్తూ వచ్చింది. దీంతో మత్స్యకారులు అవస్థలు పడకుండా వేట నిషేధ సమయాన్ని గడిపేవారు.

పట్టించుకోని ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం ఇప్పటికి భృతి మంజూరుపై ఎటువంటి నిర్ణయం ప్రకటించకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. అధికారంలోకి వస్తే భరోసా సాయం రూ.10 వేల నుంచి రూ. 20 వేలు పెంచుతామంటూ హామీ ఇచ్చింది. దాన్ని నేటికీ అమలు చేయకపోవడంతో మత్స్యకారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పింఛన్‌దారులు, ప్రభుత్వం నుంచి ఏదైనా లబ్ధి పొందుతున్న వారిని జాబితా నుంచి తొలగిస్తారనే అనుమానాలు మత్స్యకారుల్లో ఉన్నాయి.

నిధులు విడుదల కాగానే సాయం

మత్స్యకారులకు వేట నిషేధ సాయం అందించే భరోసా పథకానికి ఇప్పటికే అర్హులను జిల్లాలో గుర్తించాం. ఆరు నియోజకవర్గాల్లో వివరాలను ప్రభుత్వ ఉన్నతాధికారులకు అందించాం. మత్స్యకార భరోసాపై ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం మాకు రాలేదు. నిధులు విడుదల కాగానే వెంటనే సాయం అందిస్తాం.

– పి.సురేష్, డెప్యూటీ డైరెక్టర్, మత్స్యశాఖ

కొందరికే డీజిల్ సబ్సిడీ

సముద్రంలో వేట సాగించే మత్స్యకారుల్లో పలువురికి డీజిల్ సబ్సిడీ అందడం లేదు. ఏడాదిలో వేట నిషేధ కాలం రెండు నెలలు మినహాయించి కేవలం 10 నెలలకే డీజిల్ సబ్సిడీ అందిస్తున్నారు. అదికూడా లీటర్‌కు రూ.9లు మాత్రమే ఇస్తున్నారు. దీన్ని రూ.15కి పెంచి అందరికీ నెలకు 500 లీటర్లు ఇవ్వాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం రిజిస్టర్ బోట్లు ఒక్కో దానికి నెలకు 300 లీటర్లు మాత్రమే డీజిల్ ఇస్తున్నారు. ఇది కేవలం మూడు దఫాలుగా వేట చేసేందుకు ఉపయోగపడుతుందని, తర్వాత వెళ్తే అదనంగా డీజిల్ కొనుగోలు చేయాల్సి వస్తోందని మత్స్యకారులు వాపోతున్నారు.



త్వరగా భరోసా సాయం అందించాలి



తాము అధికారంలోకి వస్తే మత్స్యకార భరోసా రూ.20వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. తీరా వేట నిషేధం ముగిసి రెండు నెలలు కావస్తున్నా మమ్మల్ని పట్టించుకున్న నాథుడే లేదు. గత ప్రభుత్వ హయాంలో ఠంఛనుగా రూ.10వేలు మా బ్యాంకు ఖాతాకు జమ అయ్యేవి. ప్రస్తుతం సర్వే పేరుతో కాలయాపన చేస్తున్నారు.

–అంజయ్య, మత్స్యకారుడు

మా జీవితాలతో ఆడుకోవడం దుర్మార్గం



ఎన్నికల సమయంలో మత్స్యకారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చి తీరా అధికారం చేపట్టిన తర్వాత మాకు ఇచ్చే సాయం కూడా ఇవ్వకపోవడం దుర్మార్గం. మత్స్యకారులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలి. మా బతుకులకు భరోసా కల్పించాలి.

– రాజారావు, మత్స్యకారుడు

అండగా నిలిచిన జగన్



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకార భరోసా రూ.10 వేలు అందించారు. గంగపుత్రులు అందరికీ అన్నీ పథకాలు అందించి అండగా నిలిచారు. ఆయన చేసిన మేలును మరువలేం.

–తాతారావు, మత్స్యకారుడు

సంక్షామ హాస్టళ్లు



బాపట్లలోని గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో వంట చేసుకుంటున్న విద్యార్థులు

- సమస్యల చెరలో వసతి గృహాలు
- విద్యార్థులే వంటమాస్టర్లు, స్వీపర్లు
- కనీస వసతులు కరువు
- అస్తవ్యస్తంగా మరుగుదొడ్లు
- బహిర్భూమికి వెళ్తున్న విద్యార్థులు
- జిల్లాలో రూ. 3.1 కోట్ల మేర నిలిచిన బకాయిలు



చెత్తకుండీల్లో పడేస్తున్న అన్నం, కూరలు

సాక్షి విజిట్

బాపట్ల టౌన్: జిల్లాలో సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయి.మౌలిక వసతులు కరువయ్యాయి. అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరాయి.

హాస్టళ్లలో విద్యార్థుల వివరాలు

- జిల్లాలో ఎస్సీ హాస్టల్స్ మొత్తం 27 ఉండాల్సి ఉండగా వాటిల్లో విద్యార్థులు లేక రెండు మూతపడ్డాయి. ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్న 25 వసతి గృహాల్లో 1662 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.
- జిల్లాలో మొత్తం ఎస్టీ వసతి గృహాలు 3, ఆశ్రమ, గురుకుల పాఠశాలలు 7 చొప్పున మొత్తం 10 వసతి గృహాలు ఉన్నాయి. వాటిల్లో 1084 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.
- బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో మొత్తం 42 వసతి గృహాలు ఉండగా వాటిల్లో 15 విద్యార్థులు లేక మూతపడ్డాయి. ప్రస్తుతం 27 వసతి గృహాల్లో 1170 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వాటిల్లో 8 కళాశాల వసతిగృహాలు, 19 పాఠశాలల వసతిగృహాలు ఉన్నాయి.

వసతులు అధ్వానం

- రేపల్లె బీసీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. తలుపులు లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయటే స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఎస్సీ బాలుర వసతి గృహంలోని పలు గదుల్లో శ్లాబు పెచ్చులూడి చువ్వలు బయటపడ్డాయి. కిటికీల వద్ద ఏర్పాటు చేసి ఉన్న సన్ సైడ్‌లు పూర్తిగా శిథిలం అవ్వటంతో చిన్నపాటి వర్షానికే నీరు గదుల్లోకి చేరుతోంది. పట్టణంలోని గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. వసతిగృహంలోని కిటికీలకు ఒక్కదానికి కూడా మెస్‌లు లేవు. దీంతో దోమలు విద్యార్థుల కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి.వంటగదిలో చెత్తాచెదారం నిల్వలు పేరుకుపోయి ఉన్నాయి. వసతిగృహంలో మొత్తం 10 మరుగుదొడ్లు ఉండగా వాటిల్లో ఒక్కటి కూడా సక్రమంగా పనిచేయటం లేదు. దీంతో విద్యార్థులు సైకిళ్లపై కిలోమీటర్ల మేరా బహిర్భూమికి వెళ్తున్నారు. నిజాంపట్నం మండలం శింకపాలెం బీసీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- వేమూరు నియోజకవర్గం చుండూరు బాలుర గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. భట్టిప్రోలులో ఎస్సీ బాలుర వసతిగృహంలో ఫ్యాన్ల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- పర్చూరు నియోజకవర్గ పరిధిలోని మార్టూరు మండలంలో బాలికల సంక్షేమ వసతి గృహంలో తాగునీరు సమస్య ఉంది. వలపర్లలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో శ్లాబునుంచి పెచ్చులూడి పడుతున్నాయి. వసతిగృహం అధ్వానంగా ఉంది.
- చీరాలలోని బీసీ బాలుర వసతి గృహాల్లో ఇన్‌చార్జ్ వార్డెన్‌ల పాలన కొనసాగుతోంది. వేటపాలెంలోని బీసీ బాలుర వసతి గృహం రేకుల షెడ్డు కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో అగచాట్లు తప్పడం లేదు.
- అద్దంకిలోని బీసీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నాయి. భవనం కిటికీల తలుపులు లేకపోవడంతో వర్షపు జల్లులు పడుతున్నాయి. తాగునీటి సౌకర్యం సరిగాలేదు.

అప్పుల ఊబిలో వార్డెన్లు

గడిచిన ఆరునెలలుగా వార్డెన్లకు బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 3నుంచి 6వ తరగతిలోపు విద్యార్థులకు నెలకు రూ. 1150, 6నుంచి10 తరగతిలోపు విద్యార్థులకు రూ. 1400, ఇంటర్ నుంచి డిగ్రీలోపు విద్యార్థులకు రూ. 1600 చొప్పున చెల్లించాలి. జిల్లాలో మొత్తం 3860 మంది విద్యార్థులు వసతిగృహాల్లో విద్యనభ్యసిస్తున్నారు. సగటున ఒక్కో విద్యార్థికి నెలకు రూ. 1300 చొప్పున నెలకు రూ. 50.18 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఆరు నెలలకు గానూ వార్డెన్లకు ప్రభుత్వం రూ. 3.1 కోట్లను ఇవ్వాలి.

భ్రమరాంబకు లక్ష గాజుల అలంకరణ



బేతపూడిలోని భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కార్తిక మాస మహోత్సవాలలో భాగంగా బుధవారం అమ్మవారికి లక్ష గాజులతో అలంకారం చేశారు. ఆలయ ఆవరణలో జరిగిన కుంకుమ పూజల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో లలితా సహస్ర నామ పారాయణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఏర్పాట్లను కార్యనిర్వాహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు.

– రేపల్లె రూరల్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కలెక్టర్ జె. వెంకటమురళి

బాపట్ల టౌన్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి తెలిపారు. మండలంలోని సూర్యలంక సమీపంలోని నగరవనంలో బుధవారం కలెక్టరేట్ సిబ్బంది ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. తొలుత కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు నాటారు. ఆయనతో పాటు పలువురు జిల్లా అధికారులు కూడా నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతిని ప్రేమించడంతో పాటు కాపాడాలని తెలిపారు. భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందిద్దామనే నినాదంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి ఆగస్టు 30 నుంచి వనసమారాధన వరకు విస్తృతంగా మొక్కలు నాటాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్ని జిల్లాల అధికారులను ఆదేశించారని జిల్లా కలెక్టర్ చెప్పారు. రాబోయే తరాలకు మంచి పర్యావరణం అందించడానికి ఇప్పుడు నాటే మొక్కలు ఎంతో మేలు చేస్తారని తెలిపారు. ఇప్పటి దాకా అటవీశాఖ ద్వారా 63 వేల మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా సూర్యలంక బీచ్‌లో అందమైన వనం ఏర్పాటు లక్ష్యంతో అధికారులు ముందుకు సాగాలని ఆయన సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులంతా అటవీ ప్రాంతంలో వన భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, జిల్లా అటవీ శాఖ అధికారి భీమయ్య పాల్గొన్నారు.

తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తత అవసరం

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి ఆదేశించారు. జిల్లా, మండల స్థాయి అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారే అవకాశం ఉందని తెలిపారు. మత్స్యకారులు ఈనెల 27 వరకు వేటకు వెళ్లొదని, ఇప్పటికే వెళ్లిన వారిని బయటకు రప్పించాలని ఆదేశించారు. వరి చేలను 22 నుంచి 27వ తేదీ వరకు కోయరాదని, దీనిపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

- అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ జె. వెంకటమురళి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. రెండు అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యోగానికి ముగ్గురు హాజరు కాగా, 44 ఆయాల ఉద్యోగాలకు 106 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో మహిళ శిశు అభివృద్ధి శాఖ పీడీ ఉమా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- చిన్నారులను దత్తత తీసుకునే విషయంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో దత్తత అవగాహన మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా వెంకట్రావు



బాపట్ల టౌన్: విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా డి. వెంకటరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జిల్లా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పనిచేస్తున్న ఆయన బదిలీపై బాపట్ల వచ్చారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని పంచాయతీరాజ్ సంస్థల ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు శిక్షణలు ఇచ్చే ప్రాంతీయ శిక్షణ కేంద్రంగా బాపట్ల ఉంటుందని ఆయన తెలిపారు. పంచాయతీ రాజ్ సంస్థల బలోపేతం చేసే దిశగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఉన్నతాధికారుల సమన్వయంతో శిక్షణ కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.